# చొరవ

మనలో కొందరికి ఎంతమంది జనంలోకైనా చొరవగా దూసుకెళ్ళి ఏ పనైనా అవలీలగా సాధించే నేర్పూ, చొరవా, ధీరోదాత్త గుణాలు కన్పిస్తాయి ! అందరిచేతా 'హీరో'ల్లా కీర్తించబడి నల్గురి దృష్టినీ ఆకర్షిస్తారు !

మరికొందరు పదిమంది ముందుకు వెళ్ళాల్సివచ్చినపుడు - కట్టెలా బిగిసుకు పోతారు! అందరి కళ్ళూ తమ మీదే 'ఫోకస్' అవుతున్నాయన్న సంగతి స్ఫురణకు వస్తే - కాళ్ళు తడబడిపోతాయి! గొంతు తడారిపోతుంది. ఇదీ అని చెప్పలేని ఇబ్బందితో సతమతమైపోతారు! ఎప్పుడూ ఎవరో ఒకరి కొంగుచ్చుకుని వారి నీడలో నడవడానికే ప్రయత్నిస్తూ 'పిరిగ్గొడ్డు'ల్లా పేరు పడిపోతారు.

'చొరవలేని గోల్డ్ మెడలిస్ట్' నాలుగు గోడల మధ్యే ఉండిపోవడం -'చొరవ ఉన్న శుంఠ' ప్రపంచాన్ని చుట్టి రావటం చూసినపుడు... తెలివితేటలకీ, జీవితంలో రాణించడానికీ ఏమాత్రం సంబంధంలేదన్న విషయం స్పష్టమై ఆశ్చర్యం కలుగుతుంది.

కొన్నిసార్లు అనుకోకుండా అవకాశాలు మన ఇంటి తలుపు తట్టినపుడు మనలో అర్హత ఉన్నా... చొరవ లేకపోతే - కలిసి వచ్చిన అదృష్టాన్ని కాలదన్ను కున్నవాళ్ళమవుతాం!

ఏదేమైనా మనకి తెలీని విషయాన్ని తెలుసుకోడానికో, మన సందేహాలను తీర్చు కోడానికో చొరవ చూపితే తప్పులేదుగానీ -ఎదుటి వాళ్ళ అంతరంగిక విషయాల్ని తరిచి తరిచి అడగడానికో - వాళ్ళ కట్టూ, బొట్టూ, వస్త్రధారణలపై మన ఆయాచిత సలహాలను గుమ్మరించడానికో చొరవ చూపితే మన 'అతి చొరవ'కి ఒళ్ళుమండి - ఎదుటి వాళ్ళు నొసలు చిట్లించడమో - మరీ మొహమాటంలేని వాళ్ళయితే మన మొహం మీదే 'ఇట్స్ నన్నఫ్ యువర్ బిజినెస్' అని చీదరించుకోవడమో చేస్తారు.

ఏదైనా... ఒకపని చేయడానికి - మొహమాట పడేవాడూ... బిడియపడేవాడూ - అభిమానపడేవాడూ జీవితంలో దేన్నీ సాధించలేడు!

అలాగని...

ఒకర్ని అప్పు అడగడానికి... మొహమాటపడాల్సినచోట....

ఒకరి పర్సనల్ రూమ్‌లోకి చొచ్చుకుపోవడానికి బిడియపడాల్సినచోట....

ఒకర్ని దేబిరించడానికి అభిమానపడాల్సినచోట...

'చొరవ' ప్రదర్శిస్తే అది వికటించి - సదరు వ్యక్తి నల్గుర్లో చులకనయ్యే ప్రమాదం ఏర్పడుతుంది.

1-4-1996